క్లుప్తంగా

31న మండల సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: తాండూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 31వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ఎమ్మెల్యేను కోరిన రైతులు

తాండూరు రూరల్: మండలంలోని గౌతపూర్ కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని రైతులు కోరారు. శుక్రవారం గౌతపూర్ సర్పంచు రాజప్పగౌడ్ ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేను రైతులు కలిసి ఈ మేరకు విన్నవించారు. కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షం పడితే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే డీసీఎంఎస్ జిల్లా అధికారులకు ఫోన్ చేసి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

‘సీఈఐఆర్’తో ఫోన్ రికవరీ



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ అరవింద్‌కుమార్

యాలాల: రోడ్డుపై ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ యాప్ సహాయంతో రికవరీ చేసి శుక్రవారం బాధితుడికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ అహ్మద్ గత వారం జక్కేపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ వద్ద తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అదే రోజు యాలాల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ యాప్‌తో లోకేషన్ ట్రాప్ చేశారు. దేవునూరు గ్రామానికి చెందిన యువకుడికి ఫోన్ దొరకడంతో అతని నుంచి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అందజేశారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లికి చెందిన కే హన్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ స్థానిక నాయకులతో కలసి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు మల్లికార్జున్, మాసయ్య, కృష్ణా జీ, చెన్నయ్య, చరణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రుక్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శివలీల

పెద్దేముల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శివలీల సూచించారు. శుక్రవారం మండలంలోని రుక్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్, డీఈఓ వనిత, ఏఎన్‌ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు

పరిగి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2013 నుంచి పీఆర్‌సీ పెంచడం లేదన్నారు. 10 సంవత్సరాలుగా ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే తీర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్థిక సాయం అందని ద్రాక్షేనా..!

- కేసీఆర్ కిట్‌తో సరిపెడుతున్న ప్రభుత్వం
- రెండేళ్లుగా గర్భిణులు, బాలింతలకు అందని సాయం
- నిధులు లేక నిలిచిన పథకం

కొడంగల్ రూరల్: మాతాశిశు సంరక్షణలో భాగంగా ప్రభుత్వం గతంలో గర్భిణులు, బాలింతలకు విడతల వారీగా నగదు పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. విడతల వారీగా నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేది. కాగా రెండేళ్లకు పైగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందడం లేదు. దీంతో లబ్ధిదారులు తమకు డబ్బులు రావడం లేదని ఆశ వర్కర్ల వద్ద మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం కేసీఆర్ కిట్ తోపాటు నాలుగు విడతల్లో గర్భిణులు, బాలింతలకు ఆర్థిక సాయం చేసేది. అమ్మాయి పుడితే రూ. 13వేలు, అబ్బాయి పుడితే రూ. 12వేలు ఆర్థిక సాయం అందించేది. ఇందులో భాగంగా గర్భిణులు ఆశ వర్కర్ల వద్ద తమ వివరాలను నమోదు చేసుకునే వారు. బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ నంబర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గర్భిణిగా ఉన్న సమయంలో ఒక విడత, ప్రసవ సమయంలో మరో విడత, చిన్నారుల 5 నెలల వయస్సులో ఒకసారి, పది నెలల వయస్సుల్లో మరోసారి ఆర్థిక సాయం అందించే వారు. ప్రస్తుతం ఈ ఆర్థిక సాయం అందడంలో ఆలస్యం అవుతుందని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో



గర్భిణులు, బాలింతల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

సాధారణ, క్లస్టర్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్స ద్వారా ప్రసవాలను చేస్తున్నారు. కేసీఆర్ కిట్లను పంపిణీ చేస్తున్నా ఆర్థిక సాయం మాత్రం అందడం లేదని పలువురు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ పథకం అమలు కావడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గర్భిణులు, బాలింతలకు ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేయాలని వారు కోరుతున్నారు.

నగదు పంపిణీ ఇలా..

ఐదు నెలల గర్భిణికి రూ. 3వేలు, ప్రసవించిన సమయంలో పాప జన్మిస్తే రూ. 5వేలు, బాబు పుడితే రూ. 4వేలు, బిడ్డకు ఐదు నెలలు నిండితే రూ. 2వేలు, పది నెలలు నిండితే రూ. 3వేల ఇస్తారు. కాగా ఏడాదికి పైగా ఈ మొత్తం గర్భిణులు, బాలింతల ఖాతాల్లో జమ కావడం లేదు.

నిధులు రాలేదు



ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే బాలింతలు, గర్భిణుల బ్యాంక్ ఖాతాల్లో నగదును నేరుగా జమ చేస్తాం. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణులు, బాలింతల వివరాలు సేకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

– రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల
- శివారెడ్డి పేట్ ఫిల్టర్ బెడ్ సందర్శన

వికారాబాద్ అర్బన్: పట్టణ ప్రజలకు అవసరమైన మేరకు మంచినీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. శుక్రవారం శివారెడ్డి పేట్‌లోని ఫిల్టర్ బెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణానికి కొంత కాలంగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదన్నారు. దీంతో శివారెడ్డి పేట్ చెరువు నీటిని ఫిల్టర్ చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీరు ఎరుపు రంగులో ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఫిల్టర్ బెడ్‌ను సందర్శించినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా పట్టణానికి మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా చూస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కృపాకర్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించాలి

స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ కలసి వస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాయత్రి లక్ష్మణ్, కృష్ణారెడ్డి, నర్సింలు, మేనేజర్ కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజుల తదితరులు

పనుల్లో నాణ్యత తప్పనిసరి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. రైతులు, ప్రజలకు సమీకృత మార్కెట్ యార్డులను త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సహకారంతో పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. భవిష్యత్తులో పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్ కృష్ణ, నాయకులు, అధికారులు మునీర్, రవీందర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీకృత మార్కెట్ యార్డ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

బాల్యవివాహాలు నేరం



కుల్కచర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర



బంట్వారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్



పూడూరు: బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ తదితరులు

కుల్కచర్ల: బాల్యవివాహాలు చేయడం నేరమని ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాల నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజం ఎంతో అభివృద్ధి చెందిందని ఈ సమయంలో కూడా బాల్యవివాహాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అంగన్‌వాడీలు బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ శ్రీశైలంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ కుమార్, సీడీపీఓ ప్రియదర్శిని, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మండల కోఆర్డినేటర్ ఆంజనేయులు, చైల్డ్ లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

బంట్వారం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ప్రభాకర్ సూచించారు. ఐసీడీఎస్ చైల్డ్ లైన్ 1098 ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు జరిపిస్తే చట్ట పరంగా చర్యలు ఉంటాయన్నారు. బాలికలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, ఎంపీఓ విజయ్‌కుమార్, ఆర్‌ఐ తులసీరామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతీదేవి, చైల్డ్ లైన్ కౌన్సిలర్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్‌గుర్తి గ్రామంలో..

పూడూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ సంధ్యా అన్నారు. శుక్రవారం మండలంలోని సోమన్‌గుర్తి గ్రామంలో కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలపై అఘాయిత్యాలు, దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ కమిటీపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిరిదేవిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్సమ్మ, అంగన్‌వాడీలు అరుణాదేవి, ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

కుల్కచర్ల: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. ఈ ఘటన చౌడాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చౌడాపూర్‌కు చెందిన రాజేశ్వరీకి శుక్రవారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనం మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళను కాపాడిన 108 సిబ్బంది కృష్ణ, పైలెట్ నర్సింహులు గౌడ్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రేపు సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి వేడుకలు

అనంతగిరి: అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రాచార్య, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్, తాండూర్, పరిగి పట్టణాల్లో వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సాహితీ ప్రియులు, కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

క్రీడలతో మనోధైర్యం: తహసీల్దార్



ద్వితీయ స్థానంలో నిలిచిన ఖోఖో జట్టు క్రీడాకారులతో తహసీల్దార్, ఎంఈఓ

తాండూరు టౌన్: క్రీడలు మనో ధైర్యాన్ని పెంపొందిస్తాయని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. వికారాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన సీఎం కప్ ఖోఖో పోటీల్లో తాండూరు పట్టణం వేదిక్ విశిష్ట పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం జట్టు సభ్యులను తహసీల్దార్, ఎంఈఓ వెంకటయ్య గౌడ్, కోచ్‌లు అనంతయ్య, రాములు అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నాగభూషణం, మహిపాల్ రెడ్డి, సుహాస్, పీఈటీ రాము పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



నర్సింలును పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్త.. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ వాసి నర్సింలు మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతుండగా శుక్రవారం పరామర్శించారు. నర్సింలుకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందిని కోరారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండలంలోని అన్ని ఊర్లను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సర్పంచ్‌లకు సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధుల నుంచి మండలానికి మంజూరైన రూ.2 కోట్ల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడులేని విధంగా మండలానికి కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని అన్నారు. ఫలితంగా అంతర్గత మురుగు కాలువలు, సీసీరోడ్లు, మంచి నీటి సదుపాయాలు, చెరువుల మరమ్మతులు చేశామని వివరించారు. గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభోదయం కార్యక్రమాల ద్వారా తెలుసుకొని నిధులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం వైస్‌చైర్మన్ మల్లేశ్, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, దర్శన్, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, నర్సింహులు, మునీర్, గోపాల్, రాంచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

వ్యసనాలకు బానిసలు కావొద్దు

దోమ: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విశ్వజన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆకతాయిలు బాలికలను వేధిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి మార్గంలో సాగాలని సూచించారు.

మహాసభలను సక్సెస్ చేద్దాం

కొడంగల్ రూరల్: జూన్ 4న జరగనున్న కుల నిర్మూలన పోరాట సమితి మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ సమితి బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు అంజిలప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట మండల ప్రధాన కార్యదర్శి అంజి, ఎన్కెపల్లి రవి, కొడంగల్ వెంకటయ్య, ఇందనూర్ అంజి, ఆనంద్, కొత్తూరు నర్సింలు, రావులపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

విద్యుత్ సమస్యలను పట్టించుకోరా?

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో 20రోజుల నుంచి కరెంటు సమస్య ఉందని లైన్‌మెన్, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ మంజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి శుక్రవారం మండల విద్యుత్ అధికారి హమునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కరెంటు వస్తూ పోతోందని, ఇలా రోజుకు 20–30 సార్లు జరుగుతోందని లైన్‌మెన్‌లకు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లూజ్‌లైన్‌ల కారణంగా గాలి దుమారానికి చెట్లకు ఆనుకొని కరెంటు వెంటనే పోతోందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారి మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ వైర్లకు సమీపంలో చెట్ల కొమ్మలు ఉండడం వల్ల ఎర్తింగ్ ట్రిప్ అవుతోందన్నారు. రానున్న రోజుల్లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవియాదవ్, వార్డు సభ్యులు మాల యాదయ్య, గ్రామస్తులు జల్లాల మల్లేష్, బుర్రకాయల రమేష్, సుధాకర్, గిరి, శ్రీనివాస్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకుంటోందని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మద్దూరు, కుమ్మరిగూడ, అంతారం గ్రామాల్లో జీవాల్లో చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రైతూ జీవాలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ధారూరు: మండలంలోని నాగసమందర్ గ్రామంలో హనుమాన్ మందిర నిర్మాణానికి ఎంపీపీ విజయలక్ష్మి, వాలీబాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి దంపతులు శుక్రవారం రూ. 1,61,116 విరాళం అందజేశారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకుందని, పునరుద్ధరణకు అందరూ ముందుకు రావాలనీ హన్మంత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయకుమార్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బస్వరాజ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి